# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 146 గుంటూరు, గురువారం 05- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


# 2026-27 ఏపీ బడ్జెట్

# పయ్యావుల కీలక చర్చలు



**అమరావతి, ఫిబ్రవరి 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈనెల 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా ఆర్థిక మంత్రి వరుసగా ప్రీ-బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు శాఖలకు చెందిన మంత్రులతో సమావేశాలు పూర్తయ్యాయి. మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనితలతో వరుస సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ శాఖల మంత్రులు తమ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి సమర్పించారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. రోడ్ల అభివృద్ధిపైనా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పాత హోల్స్ రోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు, లాజిస్టిక్స్ సెక్టార్ వృద్ధిపై సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టనుంది. అంతేకాకుండా, జల్ జీవన్ మిషన్ పథకాన్ని వేగవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం (ఫిబ్రవరి 3) చర్చలు జరిపారు. అలాగే మిగిలిన శాఖల మంత్రులతోనూ త్వరలో సమావేశాలు జరిగే అవకాశం ఉంది.



## సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం సమావేశం..

**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 4: సీఎం చంద్రబాబు నాయుడితోడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈరోజు (బుధవారం) ఉదయం సీఎం నివాసానికి చేరుకున్నారు పవన్. అనంతరం ఇద్దరి మధ్య సమావేశం మొదలైంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, సున్నితమైన అంశాలపై విపక్షం రెచ్చగొట్టే ప్రయత్నాలు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికలు, నియామక పదవులు, కూటమి పక్షాల సమన్వయం, వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టడంపై చర్చించనున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది. తిరుమలకు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్న నేపథ్యంలో.. వారి మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే గతంలో సీఎం మాట్లాడటం, విచారణకు ఆదేశించడం, అలాగే ఈ అంశంపై సుప్రీం కోర్టుకు పలువురు వెళ్లగా సీబీఐ నేతృత్వంలో సిట్ ఏర్పాటై ఈ వ్యవహారంపై విచారించడం జరిగింది. సిట్ తన నివేదికను కేబినెట్ ముందు ఉంచగా నిన్న (మంగళవారం) ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. నెయ్యి కల్తీ జరగడం వాస్తవమని తేలడంతో.. ఇందులో ఎవరు సూత్రధారులు అనేదానిపై కేబినెట్‌లో చర్చించడంతో పాటూ కల్తీకి ఆస్కారం ఇచ్చిన వారంతా బాధ్యులే అని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

## మోదీ మలేసియా పర్యటన ఖరారు

**న్యూఢిల్లీ: ఫిబ్రవరి 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండ్రోజుల అధికారిక పర్యటనకు మలేసియా వెళ్తున్నారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 7,8 తేదీలో మలేసియాలో పర్యటించనున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ బుధవారంనాడు తెలిపింది. మలేసియాలో మోదీ పర్యటించనుండటం ఇది మూడోసారి. అయితే 2024 ఆగస్టులో ఇరుదేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలను కుదుర్చుకున్న తరువాత మలేసియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతే ప్రధాన లక్ష్యంగా మోదీ పర్యటన ఉంటుందని ఎంఈఏ తెలిపింది. ప్రధాని తన పర్యటనలో భాగంగా మలేసియా ప్రధానితో సమావేశమై ఇరుదేశాల మధ్య సహకారంతో పాటు పలు అంశాలపై చర్చిస్తారు. మలేసియాలోని ప్రవాస భారతీయులను కలుసుకుంటారు. పారిశ్రామిక వేత్తలు, వాణిజ్య ప్రతినిధులతో సమావేశమవుతారు. ఇండియా-మలేసియా సీఈఓ ఫోరం సమావేశంలోనూ మోదీ పాల్గొంటారు.
కాగా, చరిత్ర, నాగరికత, సాంస్కృతిక సంబంధాల పరంగా భారత్-మలేసియా మధ్య సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. మలేసియాలో 29 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. ప్రపంచంలో ప్రవాస భారతీయులు అత్యధికంగా నివసిస్తున్న దేశాల్లో మలేసియా మూడవది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, తీరప్రాంత సహకారం, డిజిటల్- ఫైనాన్షియల్

2 లో



## వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా

### తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04** వెనుకబడిన వర్గాలను కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా , ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ-3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ. 60 కోట్ల సాస్కీ నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ. 17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ

2 లో

## జనసేన నేత నాగబాబు కీలక వ్యాఖ్యలు




**అమరావతి, ఫిబ్రవరి 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** హిందూ ద్రోహి వైసీపీ అంటూ జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ నాగబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీపై ఫైర్ అవుతూ.. బుధవారం నాడు నాగబాబు ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో.. 'ఆది శంకరుల అద్వైతం. నేను పరమాత్మను

2 లో

## కూటమి ఐక్యతపై బాబు-పవన్ స్పెషల్ ఫోకస్:

### కుల రాజకీయాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు!



**ఫిబ్రవరి 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన రెండు గంటల సుదీర్ఘ సమావేశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పాలనాపరమైన నిర్ణయాలతో పాటు ప్రధానంగా కూటమిలోని పార్టీల మధ్య సమన్వయంపై ఈ ఇద్దరు నేతలు లోతుగా చర్చించారు.

2 లో

## ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్టులపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం:



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04** గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలోని నీటి పారుదల రంగం పూర్తిగా గాడి తప్పిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి సుమారు రూ. 18 వేల కోట్ల మేర బకాయిలు పెట్టిందని, దీనివల్ల అనేక పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆయన ఆరోపించారు. వైసీపీ అనుసరించిన విధానాల వల్ల వ్యవస్థ మొత్తం ధ్వంసమైందని, ఆ అస్తవ్యస్త

2 లో

# మోదీ మలేసియా పర్యటన ఖరారు

టెక్నాలజీ, ఇంధనం, హెల్త్‌కేర్, విద్యుం, సంస్కృతి, పర్యాటక, ప్రజా సంబంధాల పరంగా భారత్–మలేసియా మధ్య విస్తృత సహకారం ఉందని, ఈ రంగాల్లో ప్రగతిని ఇరుదేశాల ప్రధానులు సమీక్షించనున్నారని ఎంఈఏ తెలిపింది.

## జనసేన నేత నాగబాబు కీలక వ్యాఖ్యలు

నమ్ముతాను. హిందుత్వం అనేది ఒక ధర్మం. ఇది జియోగ్రాఫికల్ ఐడెంటిటీ. ఈ పుణ్య భూమిలో పుట్టిన ప్రతిఒక్కరూ హిందువే. నా ధర్మాన్ని గౌరవిస్తూ.. ఇతరులను కించపరచకుండా బతుకుతాను. అలానే అర్చకుల జీతభత్యాల గురించి నేను శాసనమండలిలో మాట్లాడాను' అని నాగబాబు తెలిపారు.ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దారుణ ఘటనలను నాగబాబు ప్రస్తావించారు. '2020 సెప్టెంబర్ 6న అంతర్వేది రథం దగ్ధమైన రోజు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం ఉద్యమాలకు తలొగ్గి కేసును సీబీఐకి అప్పగిస్తామని చెప్పింది. 2023లో ఆర్టీఐ కింద దరఖాస్తు చేస్తే.. అంతర్వేది కేసును అసలు తాము విచారణ చేయలేదని సీబీఐ వివరించింది. అంటే వైసీపీ నేతలు చేసిన ప్రకటనను అమలు చేయకుండా మోసం చేశారని తేలిపోయింది. మసి పూసి మారేడు కాయ చేయడంలో నిపుణులైన వైసీపీ నేతలు దీనిపై ఎందుకు మాట్లాడరు. అవతలి వారి వ్యక్తిగత జీవితాలపై వారికి ఉన్న ఆసక్తి.. హిందూ ఆలయాలపై ఎందుకు ఉంటుంది. రామతీర్థం రాముడు మనకు దైవం.. డిసెంబర్ 2020లో రాముడు తల నరికినా వైసీపీ ప్రభుత్వంలో చర్యలు లేవు. నామ్ కే వాస్తేగా కేసులు పెట్టి.. చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో దోషులను శిక్షించలేదు. మీరు, మీ మంత్రులకు ఇతర వ్యక్తుల సినిమాలపై రివ్యూలు ఇచ్చే శ్రద్ధ రాముడిపై ఎందుకు ఉంటుంది' అని ఆయన అన్నారు.

'అయోధ్యలో రామమందిరం కల సాకారం అయితే.. చంద్రబాబు, పవన్ వెళ్లి పాలు పంచుకున్నారు. నేడు హిందువులపై ఎక్కడ లేని ప్రేమ వలక పోస్తున్న ఆ నాయకుడు అయోధ్యపై ఒక్క పోస్టు అయినా పెట్టారా?. వెళ్లలేక పోయినా కనీసం స్పందిస్తూ.. ప్రకటన అయినా విడుదల చేశారా?. పేదల నుంచి కోటీశ్వరుల వరకు అందరూ తిరుమల వెంకన్నను దర్శనం చేసుకోవాలని చూస్తారు. అటువంటి కొండపై వసతుల ఛార్జీలు ఇష్టం వచ్చినట్లు పెంచేశారు. ఇది సామాన్యులకు భగవంతుడిని దూరం చేయడం కాదా?. మాఫియా కోసం పేద ప్రజలను వెంకన్న స్వామికి అందకుండా చేస్తారా?. కూరగాయలు బేరమాడినట్లు సేవల పెంపులో వైసీపీ నేత సుబ్బారెడ్డి బేరం ఆడిన విధానం అందరూ చూశారు. తిరుమలపై నువ్వు చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు.. టీటీడీ కామన్ గుడ్ ఫండ్ ఇచ్చే కంట్రిబ్యూషన్ రూ. 2.50 కోట్లు ఉండేది.. రూ. 50 కోట్లకు ఒకేసారి పెంచేశావు' అని నాగబాబు విమర్శించారు.

'తిరుపతిలోనే కాదు.. ఎక్కడ కొండ కనిపించినా గుండు కొట్టేయడమే మీకు అలవాటు. డిక్లరేషన్ ను గౌరవించడం మన సంప్రదాయం. అయినా బాధ్యత గురించి వైసీపీ నేతలకు చెప్పడం చెవిటోడి చెవిలో శంఖం ఊదినట్లే. పవన్ కల్యాణ్ తన సతీమణి, పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అలానే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం డిక్లరేషన్ ఇచ్చారు. అబ్దుల్ కలాం కంటే నువ్వు గొప్పోడివా.. నీ మంత్రి వచ్చి తిరుమల నీ అమ్మ మొగుడు కట్టాడా అంటాడా..?. అలా తలపొగరుతో మాట్లాడినందుకే 151 మధ్యలో 5 తీసేసి 11 సీట్లే ఇచ్చారు. అయినా నువ్వేమైనా మారావా.. డిక్లరేషన్ అడిగారని తిరుమల పర్యటన మానుకున్న చరిత్ర నీది. సెక్యులర్, రిలీజియస్ ప్లేస్‌లకు తేడా తెలియని వ్యక్తివి నువ్వు. తిరుమల కల్తీ ఉదంతంలో అబద్ధాలు చెబుతున్నారు' అంటూ వైసీపీపై నాగబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం

దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## కూటమి ఐక్యతపై బాబు-పవన్ స్పెషల్ ఫోకస్: కుల రాజకీయాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు!

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడేందుకు జరుగుతున్న ప్రయత్నాలను గమనించాలని, పాలనపైనే పూర్తి దృష్టి సారించాలని ఇరు నేతలు ఒక అభిప్రాయానికి వచ్చారు.

ఈ సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని రెండు ప్రధాన సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందన్న అంశంపై తీవ్ర చర్చ జరిగింది. కులాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని విపక్షం చూస్తోందని, ఇలాంటి ఉచ్చులో ఎవరూ పడకూడదని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు వాస్తవాలను వివరించాలని క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తెలుగుదేశం మరియు జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎంతో సంయమనంతో వ్యవహరించాలని నేతలు సూచించారు. ముఖ్యంగా ఇతర పార్టీల ట్రాప్‌లో పడి వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దని, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. కూటమి ఐక్యతను దెబ్బతీసేలా ఎవరైనా ప్రవర్తిస్తే సహించేది లేదని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఈ భేటీ ద్వారా స్పష్టమైన సందేశాన్ని పంపారు.

వచ్చే రోజుల్లో ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఇరు పార్టీల నేతలు కలిసికట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, జిల్లాల వారీగా ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకోవాలని చర్చించారు. విపక్షాల విమర్శలను పట్టించుకోకుండా, అభివృద్ధి మార్గంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడమే తమ అంతిమ లక్ష్యమని చంద్రబాబు మరియు పవన్ కళ్యాణ్ ఈ సమావేశం ద్వారా పునరుద్ఘాటించారు.

## ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్టులపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం: మంత్రి రామానాయుడు ధ్వజం

పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుతో పాటు హంద్రీనీవా, వెలిగొండ, గాలేరునగరి వంటి కీలక ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. వీటితో పాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మరియు పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను వేగవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసినప్పటికీ రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సమృద్ధిగా నీరు నిల్వ ఉండటం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన వాటర్ మేనేజ్‌మెంట్ ఉందని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. నీటి నిల్వలను శాస్త్రీయంగా నిర్వహించడం వల్లనే వర్షాకాలం తర్వాత కూడా జలాశయాలు కళకళలాడుతున్నాయని ఆయన వివరించారు. చుక్క నీటిని కూడా వృధా చేయకుండా సాగు అవసరాలకు మళ్లించేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన కొనియాడారు.

రాష్ట్రంలో నీటి పారుదల రంగాన్ని మళ్ళీ పూర్వవైభవానికి తీసుకురావడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పెండింగ్ బకాయిలను పరిష్కరిస్తూనే, కొత్త పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ప్రాజెక్టుల వ్యయం పెరిగిందని, వాటన్నింటినీ అధిగమించి నిర్దేశిత గడువులోగా సాగునీటి ప్రాజెక్టులను ప్రజలకు అంకితం చేస్తామని మంత్రి రామానాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## మైనర్ లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు




**కనిగిరి: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** సబ్‌డివిజన్ పరిధిలో మైనర్ వయస్సు కలిగిన వారు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ పి. సాయి ఈశ్వర్ యశ్వంత్ హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్‌కు అనుమతి ఇచ్చిన తల్లిదండ్రుల డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడంతో పాటు మోటార్ వాహనాల చట్టం ప్రకారం రూ. 25 వేల జరిమానా విధిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



**కనిగిరి: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి** ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 15వ వార్డులో సమాచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, టౌన్ అధ్యక్షులు షేక్ షరీఫ్, నియోజకవర్గ క్రిస్టియన్స్ సెల్ అధ్యక్షులు కే. జక్రయ్య, యూనిట్ ఇంచార్జి బ్రహ్మేంద్ర, వార్డు అధ్యక్షులు దాసరి సామ్యూల్ జాన్, బూత్ ఇంచార్జులు జిలానీ, ఆనంద్, చార్లీ, బన్ను పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆరోగ్య ఆపద్బాంధవుడు ఎమ్మెల్యే ఏలూరి!



**మార్టూరు: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసు మేరకు యద్దనపూడి మండలం తను బొద్దువారిపాలెం గ్రామానికి చెందిన తలపల అంకమ్మరావు కు అత్యవసర చికిత్స నిమిత్తం ఎల్ఓసి ద్వారా 2,01,460 చెక్కును నాయకులు, క్యాంపు కార్యాలయం ప్రతినిధులు అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించడం రాష్ట్ర ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## వన్ టౌన్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



**చీరాల: క్రైమ్ కాంటాక్ట్ జిల్లా ప్రతినిధి సతీష్** వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా పి. వెంకటేశ్వర రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అద్దంకి పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై చీరాలకు వచ్చిన ఆయన అధికారికంగా విధుల్లో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, చట్ట పరిరక్షణలో రాజీ లేకుండా విధులు నిర్వహిస్తానని చెప్పారు.

## హత్య కేసు ముద్దాయిలను రోడ్డుపై నడిపించిన పోలీసులు



**చీరాల: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** త్రినాధ్ అనే యువకుడి హత్య కేసులో అరెస్ట్ అయిన ముద్దాయిలను వన్ టౌన్ పోలీసులు బహిరంగంగా రోడ్డుపై నడిపించారు. ప్రజల మధ్య భయాన్ని సృష్టిస్తూ నేరాలకు పాల్పడే వారికి ఇది గట్టి హెచ్చరిక కావాలన్న ఉద్దేశంతోనే ఈ చర్య తీసుకున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.ఇటీవల చీరాల పరిధిలో చోటుచేసుకున్న యువకుడు త్రినాధ్ హత్య ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని సంఘటన జరిగిన ప్రాంతాలతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా రోడ్డుపై నడిపించారు.ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ, నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేశారు. ప్రజల ప్రశాంత జీవనాన్ని భంగం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా యువత నేరాల వైపు మొగ్గు చూపకుండా చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పట్టణంలో శాంతిభద్రతలు కాపాడటమే లక్ష్యంగా పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారని, నేరాలను అదుపులో ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. త్రినాధ్ హత్య కేసులో నిందితులపై బలమైన ఆధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసి కఠిన శిక్ష పడేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ పోలీసుల చర్యకు స్థానిక ప్రజలు మద్దతు తెలిపారు. నేరస్తుల్లో భయం కలిగేలా ఇలాంటి చర్యలు కొనసాగించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఫార్మసీ చదివిన వారికి.. సొంతూరిలోనే ఆదాయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని జిల్లాలలోనూ పశు ఔషధి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. జాతీయ పశువుల వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద ఈ పశు ఔషధి విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా నాణ్యమైన పశువుల మందులను రైతులకు అందుబాటులో ఉంచుతారు. తక్కువ ధరలోనే క్వాలిటీ పశువుల మందులు రైతులకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఏపీ పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు వెల్లడించారు.

ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు, సహకార సమాఖ్యల ద్వారా ఈ పశు ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 120 చదరపు అడుగుల కనీస విస్తీర్ణంలో ఈ పశు ఔషధి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. సొంత స్థలంలో అయినా, అద్దెకు తీసుకున్న స్థలంలో అయినా ఈ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ కేంద్రాలను నిర్వహించేందుకు ఫార్మసిస్టులను కూడా నియమిస్తారు. అలాగే ఈ పశు ఔషధి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కావాల్సిన అనుమతులను సంబంధిత డ్రగ్ కంట్రోల్ అథారిటీ నుంచి పొందాల్సి ఉంటుంది. మరోవైపు ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్ డివైసెస్ బ్యూరో ఆఫ్ ఇండియా ఈ పశు ఔషధి విక్రయ కేంద్రాలకు కావాల్సిన ఔషధాల సేకరణ, క్వాలిటీ టెస్టింగ్, స్టోరేజ్, మేనేజ్‌మెంట్, సరఫరా వంటి విషయాలను చూస్తుంది. పశువుల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటుగా వెటర్నరీ ట్రీట్మెంట్ ఖర్చులు తగ్గించడం, లైవ్ స్టాక్ ప్రొడక్టివిటీ పెంచడం, పశుసంవర్ధక రంగం అభివృద్ధి కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు. ఈ పశు ఔషధి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసే వారికి ఆపరేటివ్ మార్జిన్ ఇన్సెంటివ్ కింద 20 శాతం అందించనున్నట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలలో.. పశు ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అర్హత, ఆసక్తి ఉన్నవారు, సంస్థలు https://pashuaushadhi.dahd.gov.in వెబ్ సైట్ సంప్రదించాలని అధికారులు సూచించారు. లేదా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. మరోవైపు పశు ఔషధి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సహకార సొసైటీలతో పాటుగా వ్యక్తిగతంగా దీ,ఫార్మసీ లేదా బీ,ఫార్మసీ చదివిన వారు అర్హులు.

# అందరి భాగస్వామ్యంతోనే క్యాన్సర్ వ్యాధికి కట్టడి

## ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్




**క్రోసూరు క్రైమ్ కౌంటర్ పోతుగంటి నాగేశ్వరరావు** అందరి భాగస్వామ్యంతోనే క్యాన్సర్ వ్యాధికి కట్టడి చేయవచ్చునని అందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ పిలుపునిచ్చారు. బుధవారం క్యాన్సర్ డే సందర్భంగా ఆయన పల్నాడు జిల్లా క్రోసూరు మండలం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ వ్యాధి గురించి ముందు జాగ్రత్తలు తెలియజేశారు. ముందస్తు జాగ్రత్తలు, తగిన ప్రాథమిక పరిశీలన ద్వారా క్యాన్సర్ వ్యాధులను ప్రారంభ దశలోనే అరికట్టవచ్చునని ఆయన పేర్కొన్నారు క్యాన్సర్ వ్యాధులు పట్ల ప్రజలకు వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తూనే ఎన్సీడీబి4.0 ద్వారా బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ లక్షణాలు కలిగిన వారిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించే ప్రక్రియను వైద్య ఆరోగ్యశాఖ లోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆరోగ్య కార్యకర్తల ద్వారా కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు ముందస్తు జాగ్రత్తలు లో (ప్రివెన్షన్) లో భాగంగా ఎన్సిడి బి4.0 క్రింద క్రోసూరు మండలంలో ఆరోగ్య సిబ్బంది ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ నోటి,(ఓరల్), రొమ్ము (బ్రెస్ట్) , మరియు గర్భాశయ ముఖ ద్వారా (సర్వైకల్) క్యాన్సర్ ను గుర్తించేందుకు వీలుగా ప్రాథమిక స్థాయిలో పరీక్షలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అట్లాగే గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు చేయించుకునేందుకు మహిళలు సంకోచిస్తున్న సందర్భంగా ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ 30 ఏళ్లు దాటిన మహిళలకు ప్రత్యేక ఆహ్వాన పత్రిక అందించి, పరీక్షలకు రావాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు ఆహ్వాన పత్రికలో పరీక్షలు ఎక్కడ చేస్తారు ప్రదేశము, తేదీ, సమయాన్ని ముద్రిస్తున్నట్లు ఆయన తెలిపారు క్యాన్సర్ వ్యాధి ప్రధానంగా శారీరక వ్యాయామం లేకపోవడం ఒకే చోట కదలకుండా రోజు విధులు నిర్వహించటం, నిద్రలేమి, తక్కువ సమయం నిద్రించటం, జంక్ ఫుడ్, కలుషిత వంట నూనెలు, కూల్ డ్రింక్స్, వేడి ఆహారం ప్లాస్టిక్ కవర్లలో ఉపయోగించటం మరియు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ సూర్యరశ్మికి గురికావటం, ఆధునిక జీవన శైలి, పొగాకు వినియోగం, ధూమపానం, దీర్ఘకాలంగా మద్యం సేవించుట, మానసిక ఆందోళన, ఒత్తిడి, ఒంటిరితనం, మొదలైన లక్షణాలు ద్వారా ఈ వ్యాధిని గుర్తించవచ్చు అన్నారు. క్యాన్సర్ నివారణకు పౌష్టికాహారం సమతుల్య ఆహారం రోజు తీసుకోవాలన్నారు రోజు శారీరక వ్యాయామం చేయాలని మానసిక ఒత్తిడిని అతి ఆలోచనలను ఆందోళనలను కోపమును తగ్గించుకోవాలన్నారు. మానసిక ప్రశాంతత ఉల్లాసం ఆనందం మంచి మానవ సంబంధాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు .

# పెదకూరపాడు మండలం రామాపురంలో ప్రజల వద్దకు ప్రవీణ్



**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండలం రామాపురం గ్రామంలో100 రోజులు100 గ్రామాలు పర్యటనలో బుధవారం పాల్గొన్నారు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ . 37వ రోజు గ్రామంలోని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఎమ్మెల్యే. త్వరితగతిన సమస్యలు పరిష్కారం అయ్యేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు.
ప్రజా సమస్యల పరిష్కారం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా 100 రోజులు - 100 గ్రామాల పర్యటన కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.



ప్రజలకు వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తామన్న ఎమ్మెల్యే. గ్రామంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేలా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర సీనియర్ నాయకులు వెన్న సాంబశివరెడ్డి, ఎమ్మార్వో ఎన్. ధనలక్ష్మి, ఎండిఓ సాయి లీల, మండల పార్టీ అధ్యక్షులు ఎటుకూరి బ్రహ్మయ్య, 75 తాళ్లూరు సొసైటీ చైర్ పర్సన్ ఏటుకూరి రత్నబాబు, మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రామాపురం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రవీణ్




**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండలం రామాపురం గ్రామంలో వంద రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా రామాపురంలో పర్యటించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్.నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలతో ఆప్యాయంగా మాట్లాడిన



ఎమ్మెల్యే.కార్యకర్తలకు ఉన్న సమస్యలను విని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే.నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలుస్తామని భరోసాగా నిలిచిన ఎమ్మెల్యే.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, 75 తాళ్లూరు సొసైటీ చైర్పర్సన్ ఏటుకూరి రత్నబాబు, ముంతాజ్, మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# అంబటి కుటుంబానికి జగన్ భరోసా: రాజకీయ కక్షసాధింపుపై వైకాపా సమరశంఖం



**ఫిబ్రవరి 04 క్రైమ్ కౌంటర్ న్యూస్):** చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్ కావడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేరుగా రంగంలోకి దిగారు. గుంటూరులోని అంబటి నివాసానికి చేరుకున్న జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని వారికి ధైర్యం చెప్పారు. అంబటి రాంబాబు అరెస్ట్ జరిగిన తీరును, అనంతరం పోలీసులు ఆయన ఇల్లు మరియు కార్యాలయంలో సోదాలు నిర్వహించిన విధానాన్ని జగన్ నిశితంగా పరిశీలించారు. అధికారుల అత్యుత్సాహంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమని, కానీ వ్యక్తిగత కక్షలతో అక్రమ కేసులు బనాయించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పర్యటన ద్వారా తన క్యాడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు జగన్.ప్రభుత్వ తీరును తప్పుబడుతూ, ఇది ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపు చర్యేనని జగన్ ధ్వజమెత్తారు. వైసీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న అక్రమ అరెస్టులపై న్యాయపోరాటం చేస్తామని, బాధితులందరికీ పార్టీ పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. గుంటూరు పర్యటనలో జగన్ వెంట పార్టీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. అంబటి కుటుంబ సభ్యులతో సుదీర్ఘంగా మాట్లాడిన ఆయన, చట్టపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.

# కోసూరు మండలంలో సోషల్ ఆడిట్






**క్రైంకౌంటర్ కోటేశ్వరరావు కోసూరు న్యూస్ :** క్రోసురు మండలంలో అన్ని గ్రామాలలో ఈరోజు నుండి 18వ తేదీ వరకు 17వ రౌండ్ సామాజిక తనిఖీ జరుగుతుంది . బుధవారం ఎంపిడిఓ కార్యాలయం లో కో ఆర్డినేషన్ మీటింగ్ లోఎంపిడిఓ జి. రవికుమార్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం 1- 4-2024 నుంచి 31-3-2025లో జరిగిన పనుల విలువ 51033082/- ఎంజిఎన్ఆర్ఇఎస్,14055401/- పంచాయితీ రాజ్ డిపార్ట్మెంట్, మొత్తం 65088483/- విలువ గల పనులకు సామాజిక తనిఖీ జరగబోతుంది ఎనర్జీ ఎస్ సిబ్బంది చేసిన పనులు జాగ్రత్తగా చూపించాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బి.అవులయ్య ఎస్ ఆర్ పి, డిఆర్పి లు, ఏపీవో బి. వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ లు, వివిధ గ్రామాలకు సంబంధించిన పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

# పాతకక్షలతోనే రమేశ హత్య

### పథకం ట్రాక్టర్‌తో గుద్ది రాళ్లు, రాడ్లతో దాడి
### రాతనచెరువు వద్ద 12మంది నిందితులు అరెస్టు అరెస్ట్
### డీఎస్పీ వెంకట్రామయ్య



**క్రైమ్ కౌంటర్ న్యూస్):**పత్తికొండ, ఫిబ్రవరి 4 గ్రామంలోని పాతకక్షల నేపథ్యంలోనే ఎమ్మార్పీఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేశ హత్య జరిగిందని డీఎస్పీ వెంకట్రామయ్య అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సీఐ పులిశేఖర్, ఎస్ఐ మల్లికార్జునతో కలిసి రమేశ హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి చెందిన రమేశ జనవరి 30వ తేదీ నునుసు రాళ్ల గ్రామంవైపు ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లాడు. గ్రామానికి చెందిన షేక్ సుభాన వలితో పాటు మరో11మంది అతడిని వెంబండించారు. ట్రాక్టర్‌తో గుద్దడంతో పక్కనే ఉన్న గుంతలోకి రమేశ పడిపోయాడు. వెంటనే రాళ్లు, రాడ్లతో దాడి చేశారు. అదేసమయంలో బొందిమడుగులకి చెందిన వద్దేరంగస్వామి, కత్తిరి ఆచారి రంగస్వామి అటుగా రావడం కేకలు వేశారు. దీంతో నిందితులు ట్రాక్టర్‌తో సహా అక్కడి నుంచి పారిపోయారు. ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలికి రమేశ కుటుంబ సభ్యులు చేరుకున్నారు. హుటాహుటిన కర్నూలు మౌర్య ఆస్పత్రికి తరలించారు. తుగ్గలి ఇనచార్జి ఎస్ఐ మల్లికార్జున కర్నూలుకు వెళ్లి రమేశతో పాటు కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించారు. తనపై జరిగిన దాడి వివరాలను ఆస్పత్రిలో రమేష్ వాంగ్మూలం ఇచ్చారు.చికిత్స పొందుతూ కోలుకోలేక గత శనివారం రమేశ మరణించారు. దాడికేసును ఎస్ఐ మల్లికార్జున హత్యకేసుగా నమోదు చేశారు. హత్యచేసిన నిందితుల్లో ఒకరు ఓయువతిని వేధిస్తుండటంతో ఆ యువతి కుటుంబం రమేశను ఆశ్రయించారు. యువతి పక్షాన నిలిచిన రమేశ అండగో కుటుంబసభ్యులు ఆ వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. దీంతో రమేశపై అతడు కక్ష పెంచుకున్నాడు. గ్రామానికిచెందిన గొల్లసరోజమ్మ స్థలంలో నిందితులు గోడకట్టడంతో పంచాయితీ చేసి సగం స్థలం సరోజమ్మకు ఇప్పించాడు. దాడికి ఒకరోజు ముందు బొందిమడుగుల మజారా గ్రామమైన లింగనేనిదొడ్డిలో నిందితుల్లో ఒకడైన ముస్లిం వ్యక్తికి, ఎస్సీ వ్యక్తికి మధ్య ఉన్న పొలంతగాదాలో ఎస్సీ వ్యక్తికి రెండెకరాలు వస్తుందని కొలతలు వేయించాడు. పై మూడు ఘటనల నేపథ్యంలో ఈ మూడు ఘటనల నేపథ్యంలో తమ ఎదుగుదలకు అడ్డువస్తున్నాడని రమేశ ను అంతమొందిస్తేతప్ప తమ మనుగడ కష్టమని షేక్ సుభానవలి కుటుంబంతో పాటు లింగనేని దొడ్డికి చెందిన మౌలాలి కక్ష పెంచుకుని రమేశను హత్యచేసేందుకు పథకం వేసుకున్నారు. వాకింగ్‌కు వెళ్తున్న అతడిని ట్రాక్టర్‌తో గుద్ది, రాళ్లు, రాడ్లతో దాడిచేసి హత్యచేశారు. ఈహత్యకేసుకు సంబంధించి 12మంది నిందితులను బుధవారం తుగ్గలిమండలం రాతన చెరువువద్ద అరెస్టు చేశారు. చందోలిక్రాస్‌వద్ద మొరిలో దాచిన హత్యకు ఉపయోగించిన రెండు రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను పత్తికొండ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు.

# సినిమా



## షాకింగ్ విషయం చెప్పిన రవిబాబు

తెలుగు సినిమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు రవిబాబు. గతంలో ఓ ఇంటర్వ్యూలో రవిబాబు తన కెరీర్‌లోని కొన్ని ఆసక్తికర విషయాలను, చేదు అనుభవాలను పంచుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో స్థానిక నటుల కంటే ఇతర భాషల నటులకు ప్రాధాన్యత ఇవ్వడంపై రవిబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. మన నటులు అందుబాటులో ఉన్నా, బయటి నుండి నటులను తీసుకొచ్చి, వారికి తెలుగు డైలాగులు రాక కష్టపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు రవిబాబు. నితిన్ హీరోగా నటించిన విక్టరీ చిత్రంలో తనకు లాయర్ పాత్ర కోసం సురేష్ రెడ్డి అనే వ్యక్తి అడిగారని అప్పుడు జరిగిన ఓ సంఘటనను పంచుకున్నారు రవిబాబు.

నితిన్ హీరోగా, ఆర్ ఆర్ మూవీ మేకర్స్ నిర్మించిన విక్టరీ చిత్రంలో అశుతోష్ రాణా అనే హిందీ నటుడికి ఎక్కువ రెమ్యునరేషన్ ఇస్తున్నారని తెలుసుకుని, రవిబాబు గట్టిగా ప్రశ్నించారట. నాకు తెలుగు వచ్చు, అశుతోష్ రాణాకి తెలుగు రాదు. నా ఇంట్లో నేను ఉంటాను, బిజినెస్ క్లాసులో ఢిల్లీ నుంచో, బాంబే నుంచో రాను. నాకు మేకప్ మేన్, అసిస్టెంట్ లేరు, నా కారు నేను వేసుకొని వస్తాను. ఆంధ్రప్రదేశ్‌లో అతని కంటే 100 రెట్లు ఇమేజ్ నాదే ఎక్కువ అలాంటప్పుడు.. అయినప్పటికీ, తనకంటే అతనికి ఎక్కువ డబ్బులు ఎందుకు ఇస్తున్నారని నిలదీశారట. తన వాదనకు ఆ నిర్మాత దగ్గర సమాధానం లేదని, అతని కంటే చివరకు లక్ష రూపాయలు ఎక్కువ ఇస్తేనే చేస్తానని చెప్పి, ఆ సినిమా చేశానని రవిబాబు గుర్తు చేసుకున్నారు.

ఇక్కడ చాలా మంది టాలెంటెడ్ నటులు ఉన్నప్పుడు, ఇతర భాషల నుండి తక్కువ అర్హత కలిగిన నటులను ఎందుకు తీసుకువస్తున్నారని అన్నారు రవిబాబు. దీనికి ఉదాహరణగా, లెజెండ్ సినిమాలో అద్భుతమైన విలన్ పాత్ర పోషించిన జగపతి బాబును ప్రస్తావించారు. జగపతి బాబు మంచి ఆర్టిస్ట్ అని రవిబాబు అన్నారు. జగపతి బాబు వంటి తెలుగు నటులు అందుబాటులో ఉన్నా, మలయాళం, తమిళం నుండి విలన్లను ఎందుకు తీసుకువస్తున్నారని ప్రశ్నించారు. రవిబాబు తన లైఫ్ స్టైల్ గురించి మాట్లాడుతూ.. తాను ఇండస్ట్రీలో పెద్దగా ఎవరితోనూ మాట్లాడానని, పబ్లిక్ ప్లేస్‌లకు, ఫంక్షన్లకు వెళ్ళనని చెప్పారు. ఇద్దరు ముగ్గురితో మాత్రమే తన ఇంటరాక్షన్ పరిమితమని తెలిపారు. పెద్ద కమర్షియల్ దర్శకులు తనకు వేషాలు ఇవ్వరని, వారి ఫోన్లు ఎప్పుడూ రాలేదని ఆయన అన్నారు. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





## షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ తింటే ఏమవుతుంది?

ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే చాలా మందికి వచ్చే సందేహం.. స్వీట్ కార్న్ తినవచ్చా? నిజానికి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఇష్టపడే ఈ స్నాక్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే ఇది తింటే షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందా..? అనే ప్రశ్న చాలా మందిని వేధిస్తుంటుంది. స్వీట్ కార్న్‌లోని పోషక విలువలు, అది డయాబెటిస్‌పై చూపే ప్రభావాల గురించి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

డయాబెటిస్‌పై స్వీట్ కార్న్ ప్రభావం

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ : స్వీట్ కార్న్ +× స్కోరు 52-55 మధ్య ఉంటుంది. ఇది తక్కువ నుండి మితమైన కేటగిరీ కిందకు వస్తుంది. అంటే ఇతర పిండి పదార్థాల ఆహారాలతో పోలిస్తే, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచదు.

డైటరీ ఫైబర్: ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది. ఫలితంగా చక్కెర శోషణ నిదానంగా జరిగి ఇన్సులిన్ స్పైక్స్ రాకుండా ఉంటాయి.

అద్భుతమైన యాంటీఆక్సిడెంట్స్: ఇందులో ఉండే లుటీన్, జియాక్సంతిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి.

ముఖ్యమైన పోషకాలు: విటమిన్  లతో పాటు మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీకి తోడ్పడతాయి.

ప్రతికూల అంశాలు

అధిక కార్బోహైడ్రేట్లు: స్వీట్ కార్న్‌లో పిండి పదార్థాలు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మోతాదు మించితే రక్తంలో చక్కెర పెరగడం ఖాయం.

ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు: డబ్బాలో నిల్వ చేసిన లేదా స్వీటెనర్లు కలిపిన స్వీట్ కార్న్ ఉత్పత్తులు మధుమేహులకు అత్యంత ప్రమాదకరం. వీటిలో సోడియం, షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది.

షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ ఎలా తినాలి?

మోతాదు ముఖ్యం: రోజువారీ ఆహారంలో ఒక చిన్న కప్పు తీసుకోవడం సురక్షితం.

ఉడికించడం ఉత్తమం: నూనెలో వేయించడం కంటే ఉడికించిన లేదా కాల్చిన మొక్కజొన్న ఆరోగ్యకరం.

కాంబినేషన్: స్వీట్ కార్న్ తినేటప్పుడు దాంతో పాటు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారంలేదా పీచు పదార్థం ఉన్న కూరగాయలు తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది.



## గుండె జబ్బులు ఉన్నవారు బొప్పాయి తినవచ్చా?

తీపి రుచి, విటమిన్లు ఎ, సి, ఇ యాంటీఆక్సిడెంట్లతో నిండిన బొప్పాయిని సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో దీనికి సాటిలేదు. అయితే, ఈ పండు అందరికీ ఆరోగ్యప్రదాయిని కాదని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా గుండె జబ్బులు, థైరాయిడ్ కిడ్నీ సమస్యలు ఉన్నవారు బొప్పాయిని తీసుకునేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.బొప్పాయిని నివారించాల్సిన వారు -- కారణాలు:

గుండె సమస్యలు ఉన్నవారు: బొప్పాయి గుండె దడను తగ్గించే అవకాశం ఉంది. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఇది ప్రమాదకరంగా మారవచ్చు. ముఖ్యంగా రక్తాన్ని పలుచబరిచే మందులు వాడేవారు దీనికి దూరంగా ఉండాలి. బొప్పాయిలోని పపైన్ ఈ మందుల ప్రభావాన్ని పెంచి రక్తస్రావం అయ్యేలా చేస్తుంది.

గర్భిణీ స్త్రీలు: పండని లేదా సగం పండిన బొప్పాయిలో లేటెక్స్, పపైన్ అధికంగా ఉంటాయి. ఇవి గర్భాశయ సంకోచాలకు కారణమై అకాల ప్రసవం లేదా ఇతర గర్భధారణ సమస్యలకు దారితీస్తాయి.

థైరాయిడ్ రోగులు: బొప్పాయిని ఎక్కువగా తీసుకోవడం వల్ల థైరాయిడ్ హార్మోన్ స్రావంలో మార్పులు వస్తాయి. మీరు వాడే మందుల శోషణను ఇందులోని ఫైబర్ అడ్డుకుంటుంది, దీనివల్ల అలసట మెటబాలిజం దెబ్బతినే అవకాశం ఉంది.

కిడ్నీలో రాళ్లు ఉన్నవారు: బొప్పాయిలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. అయితే, విటమిన్-సి అతిగా శరీరంలోకి చేరితే అది కాల్షియం ఆక్సలేట్ కిడ్నీ రాళ్లకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లేటెక్స్ అలెర్జీ: రబ్బరు గ్లౌజులు లేదా బెలూన్ల వల్ల అలెర్జీ కలిగే వారు బొప్పాయిని తినకూడదు. దీనిలోని లేటెక్స్ ద్రవం చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలిగించవచ్చు.

గమనిక: ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. మీకు ఏవైనా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉంటే బొప్పాయిని ఆహారంలో చేర్చుకునే ముందు ఖచ్చితంగా మీ వైద్యుడిని సంప్రదించండి.

## భారత కుర్రాళ్ల విశ్వరూపం..

హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన అండర్-19 వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్‌లో భారత్ సంచలన విజయం సాధించింది. అఫ్గానిస్థాన్ నిర్మించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా కుర్రాళ్లు ఊపిరి బిగబట్టే ఉత్కంఠ లేకుండా ఛేదించేశారు. ఈ గెలుపుతో భారత్ రికార్డు స్థాయిలో 10వ సారి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. అఫ్గాన్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి చరిత్రలోనే భారత్‌పై అత్యధిక స్కోరు సాధించినా, మన బ్యాటర్ల ముందు అది తలవంచక తప్పలేదు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌పై ఏ జట్టు కూడా ఇంత భారీ స్కోరు చేయలేదు. అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో ఇద్దరు ఆటగాళ్లు సెంచరీలతో కదం తొక్కారు. ఫైసల్ షినోజాదా 93 బంతుల్లో 110 పరుగులు చేయగా, ఉజైరుల్లా నియాజై 86 బంతుల్లో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో దీపేష్ దేవేంద్రన్, కనిష్క చౌహాన్ చెరో రెండు వికెట్లు తీసినా పరుగులు ధారాళంగా సమర్పించుకున్నారు.

311 పరుగుల లక్ష్యం అంటే సామాన్యమైన విషయం కాదు. కానీ భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఈ లక్ష్యాన్ని చాలా చిన్నదిగా చేసేశాడు. కేవలం 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్, మొత్తం 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 68 పరుగులు చేసి అఫ్గాన్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. మొదటి 10 ఓవర్లలోనే భారత్ 91 పరుగులు చేసి అఫ్గానిస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. ఆరంభంలో వైభవ్ చూపిన వేగం, భారత్‌కు రన్ రేట్ భయం లేకుండా చేసింది.

వైభవ్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఆయుష్ మాత్రే బాధ్యతాయుతంగా ఆడాడు. ఆరోన్ జార్జ్‌తో కలిసి రెండో వికెట్‌కు 114 పరుగులు జోడించాడు. ఆయుష్ 59 బంతుల్లో 62 పరుగులు చేసి వెనుదిరగ్గా, ఆరోన్ జార్జ్ మరోవైపు అఫ్గాన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. క్లాసిక్ షాట్లతో అలరించిన జార్జ్, 104 బంతుల్లో 115 పరుగులు చేసి భారత్ విజయాన్ని ఖాయం చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. చివర్లో విహాన్ మల్హోత్రా (38 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశాడు. భారత్ 41.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

ఈ మ్యాచ్ పలు రికార్డులకు వేదికైంది:

హైయెస్ట్ రన్ చేజ్: అండర్-19 వరల్డ్ కప్ నాకౌట్ దశలో ఇదే అతిపెద్ద రన్ చేజ్.

భారత్ ఫైనల్ రికార్డు: ఇప్పటివరకు 10 సార్లు ఫైనల్ చేరిన ఏకైక జట్టుగా భారత్ నిలిచింది.

డబుల్ సెంచరీలు: ఒకే ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి జట్టు ఇద్దరు సెంచరీలు చేసినా భారత్ గెలవడం ఇదే ప్రథమం.

వైభవ్ వేగం: ఈ టోర్నీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీల్లో ఒకటిగా వైభవ్ ఇన్నింగ్స్ నిలిచింది.

ఫైనల్‌లో ఎవరితో?

సెమీఫైనల్‌లో అఫ్గాన్‌పై ఈ భారీ విజయం ఇచ్చిన ఊపుతో భారత్ ఫైనల్‌కు సిద్ధమవుతోంది. ఎల్లుండి జరగనున్న ఫైనల్‌లో భారత్ తన ప్రత్యర్థి ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఇప్పటివరకు ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్, ఇప్పుడు ఆరోసారి కప్పు నెగ్గడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విజయంతో భారత యువ ఆటగాళ్లపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది.




## సూర్య మాస్టర్ ప్లాన్..

టీ20 వరల్డ్ కప్‌కు ముందు జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లోనే టీమిండియా మేనేజ్మెంట్ భారీ సర్ ప్రైజ్ ఇచ్చింది. నవీ ముంబై వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న ఈ పోరులో టాస్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే అందరూ ఊహించినట్లుగా కాకుండా ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో పాటు ఇషాన్ కిషన్‌ను పంపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. మొన్నటి వరకు ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా ఉన్న సంజూ శాంసన్‌ను కాదని.. ఇషాన్ కిషన్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం చూస్తుంటే, వరల్డ్ కప్ ప్రధాన మ్యాచ్‌ల్లో కూడా ఇదే ఫార్ములా కొనసాగుతుందని అర్థమవుతోంది.

ఇషాన్ కిషన్ అదరగొట్టినందుకే ఈ గిఫ్ట్

ఇషాన్ కిషన్‌కు ఈ అవకాశం ఊరికే రాలేదు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఇషాన్ శివతాండవం చేశాడు. ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో ఏకంగా 215 పరుగులు రాబట్టి ఫామ్ అంటే తనదే అని నిరూపించుకున్నాడు. ఆ సిరీస్ చివరి మ్యాచ్‌లోనే సంజూ నుంచి కీపింగ్ గ్లౌజులు అందుకున్న ఇషాన్, ఇప్పుడు ఓపెనింగ్ స్లాట్‌ను కూడా దక్కించుకున్నాడు. గతేడాది పర్ఫార్మెన్స్ ఆధారంగా చూస్తే, సంజూ కంటే ఇషాన్‌కే మేనేజ్మెంట్ ఓటు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

సంజూ శాంసన్ పని అయిపోయినట్లేనా?

వరుసగా వస్తున్న అవకాశాలను చేజార్చుకోవడం సంజూ శాంసన్‌కు శాపంగా మారింది. న్యూజిలాండ్ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లోనూ సంజూ విఫలం కావడంతో సెలెక్టర్ల ఓపిక నశించినట్లుంది. ఇప్పుడు ఇషాన్ ఓపెనర్‌గా వస్తుండటంతో, మూడో స్థానంలో తిలక్ వర్మ వచ్చే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకొని వస్తున్న తిలక్ వర్మకు కూడా ఇది పెద్ద పరీక్షే. ఒకవేళ ఇషాన్, అభిషేక్ జోడీ గనుక వార్మప్ మ్యాచ్‌లో క్లిక్ అయితే, వరల్డ్ కప్ టోర్నీ ఆరంభ మ్యాచ్‌ల్లో సంజూ శాంసన్ బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410.  Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.